సాక్షి నల్లగొండ

బుధవారం । 20 । డిసెంబర్ । 2023



క్షేత్రపాలకుడికి ఆకు పూజ

యాదాద్రి ఆలయానికి క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి ఆకు పూజ నిర్వహించారు.

- 8లో



కరెంటు కాటుకు ఇద్దరు బలి

జిల్లాలోని హుజూర్‌నగర్, గరిడేపల్లి మండలాల్లో కరెంటు కాటుకు ఇద్దరు రైతులు బలయ్యారు.

- 8లో



మట్టపల్లిలో నిత్య కల్యాణం

మట్టపల్లి దేవాలయంలో లక్ష్మీనృసింహా స్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు.

- 8లో

న్యూస్‌రీల్

22న క్రీడా జట్ల ఎంపిక

నల్లగొండ టూటౌన్ : ఉమ్మడి జిల్లా స్థాయి హాకీ, టెన్నికాయిట్, టగ్ ఆఫ్ వార్ అండర్–19 బాల, బాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈనెల 22న నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ (అండర్–19) జిల్లా కార్యదర్శి కె.ఇందిర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 22న ఉదయం 10 గంటలకు బోనఫైడ్ సర్టిఫికెట్, 10వ తరగతి మెమోతో హాజరు కావాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు నర్సిరెడ్డి సెల్ నంబర్ (9440072854)ను నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

డీఈఈ సెట్ కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల


నల్లగొండ : ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన డీఈఈ సెట్–2023లో ర్యాంకు సాధించి అర్హత కలిగి, గతంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులు డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్‌ఈడీ) కోర్సులో 2023–25 బ్యాచ్‌లో మొదటి సంవత్సరం ప్రవేశాలకు వెబ్ కౌన్సిలింగ్‌కు షెడ్యూల్ విడుదల చేసినట్లు ప్రభుత్వ డైట్ ప్రిన్సిపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేసుకోని అభ్యర్థులు ఈ నెల 20న చేయించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నె నెల 22 నుంచి 27 వరకు డీఈఈ సెట్–2023లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 30 నుంచి మెరిట్, రోస్టర్ ప్రకారం సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. 2024 జనవరి 1 నుంచి 3 వరకు అడ్మిషన్ల కేటాయింపు ఉంటుందని, జనవరి 5లోగా కాలేజీలో రిపోర్టింగ్ చేయాలని, జనవరి 8 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.

ఐసీఏ కార్యవర్గ సభ్యుడిగా డాక్టర్ రవి



పెద్దఅడిశర్లపల్లి : దేవరకొండ పట్టణంలోని ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమావత్ రవి ఇండియన్ కామర్స్ అసోషియేషన్ (ఐసీఏ) కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఢిల్లీ విశ్వవిద్యాలయ కేంద్రంగా ఈ నెల 13 నుంచి 15 వరకు జరిగిన 74వ అఖిల భారత వాణిజ్య సదస్సు ఎన్నికల్లో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన మేనేజింగ్ ఎడిటర్ ఆఫ్ ఇండియన్ జనరల్ ఆఫ్ కామర్స్ చెన్నప్ప, ప్రొఫెసర్ పురుషోత్తమరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఐసీఏ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన రవికి కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని వినతి



మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేస్తున్న పెద్దదేవులపల్లి గ్రామస్తులు

త్రిపురారం : మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ గ్రామానికి చెందిన ఇరిగి క్రాంతి కుమార్ గ్రామస్తులతో కలిసి హైదరాబాద్ ప్రజాభవన్‌లో ప్రజావాణిలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్కకు) మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ.. మా గ్రామానికి ఇప్పటి వరకు ఎస్సీ రిజర్వేషన్ రాలేదని ఈ విషయాన్ని మంత్రి మంత్రి దృష్టికి తీసుకెళ్లామని.. ఆమె సానుకూలంగా స్పందించారని తెలిపారు. గ్రామంలో సుమారు 800 మంది ఎస్సీ జనాభా ఉందని.. పాత రొటేషన్ పద్ధతిలో ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని కోరారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

నల్లగొండటౌన్ : మెడికల్ – సేల్స్ రిప్రజెంటేటివ్స్ దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని టీఎంఎస్‌ఆర్‌యూ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం నల్లగొండలో తెలంగాణ మెడికల్ – సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ (టీఎంఎస్‌ఆర్‌యూ) (సీఐటీయూ అనుబంధం) కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ యాక్ట్ 1976ను పునరుద్ధరించాలని కోరారు. మందులు, వైద్య పరికరాలపై ఉన్న జీఎస్టీని తొలగించాలన్నారు. సమావేశంలో దండెంపల్లి సత్తయ్య, కోటా సుధాకర్, నిరంజన్, రావుల రవికుమార్, పోలా రమేష్, అనిల్, జీవన్, రాంబాబు, నరేష్, ప్రదీప్ పాల్గొన్నారు.

నల్లగొండ బరిలో సోనియా?

- తెలంగాణ నుంచి సోనియా పోటీ చేయాలని పీఏసీ ఏకగ్రీవ తీర్మానం
- ఆ నివేదికను ఢిల్లీ అధిష్టానానికి అందించిన సీఎం రేవంత్‌రెడ్డి
- నల్లగొండ నుంచే ఆమెను పోటీ చేయించాలని జిల్లా నేతల ఆలోచన
- ఇక్కడి నుంచి పోటీ చేస్తే బంపర్ మెజార్టీ ఖాయమంటున్న నేతలు
- జిల్లా అంతటా ఇదే చర్చ



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ బరిలో నిలవబోతున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సోనియాగాంధీని తెలంగాణ నుంచి పోటీ చేయించాలని కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సోమవారం గాంధీభవన్‌లో ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆ కాపీని సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం పార్టీ అధిష్టానానికి అందజేసినట్లు తెలిసింది. అయితే పీఏసీ సమావేశంలో సోనియాగాంధీ తెలంగాణలో ఏ జిల్లా నుంచి పోటీ చేస్తే బాగుంటుందనే చర్చ వచ్చిన సందర్భంలో నల్లగొండ పార్లమెంట్ నుంచి పోటీ అంశం కూడా పరిశీలించినట్లు తెలిసింది. దీంతో సోనియా గాంధీ నల్లగొండ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తే బంపర్ మెజార్టీతో విజయం సాధిస్తారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఇప్పుడు ఇదే విషయం జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది.

మెజారిటీ స్థానాలు గెలుచుకున్న కాంగ్రెస్

నల్లగొండ జిల్లా మొదట్లో కమ్యూనిస్టులకు పుట్టినిల్లు. ఆ తరువాత కాంగ్రెస్ పార్టీని జిల్లా ప్రజలు ఆదరించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో హస్తం పార్టీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా కాంగ్రెస్ పార్టీకే కంచుకోటగా మార్చారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 స్థానాలకు గాను బీఆర్‌ఎస్ 9 స్థానాల్లో విజయం సాధించింది. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించి రెండోసారి అధికారాన్ని చేజిక్కించుకుంది. అయితే ఆ తర్వాత మార్చిలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ, భువనగిరి రెండు స్థానాల్లో కాంగ్రెస్ ఎంపీలుగా ప్రస్తుత మంత్రులు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజయం సాధించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలిచిన జిల్లాగా నిలిచింది. ఉమ్మడి జిల్లాలోని 12 స్థానాల్లో ఒక్క సూర్యాపేట మినహా 11 స్థానాల్లో భారీ మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. జిల్లా ప్రజలు అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులనే గెలిపించి మళ్లీ నల్లగొండను కాంగ్రెస్‌కు కంచుకోటగా నిలిపారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీలో ఉద్దండులైన నేతలు జిల్లా నుంచే ఉన్నారు. ప్రస్తుత మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలతో పాటు సీనియర్ నేత, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, రాంరెడ్డి దామోదర్‌రెడ్డికూడా నల్లగొండ పార్లమెంట్ పరిధిలోనే ఉన్నారు.

భారీ విజయమని..

సోనియాగాంధీ నల్లగొండ పార్లమెంట్ నుంచి పోటీ చేస్తే భారీ మెజారిటీతో గెలిపించుకోవచ్చన్న ఆలోచనల్లో జిల్లాలోని సీనియర్ నేతలు ఉన్నారు. జిల్లాలో ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని చోట్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు వచ్చిన మెజారిటీ మేరకు కూడా బీఆర్‌ఎస్ అభ్యర్థులకు ఓట్లు రాలేదు. ఈ పరిస్థితుల్లో సోనియాగాంధీని నల్లగొండ నుంచి పోటీలో నిలిపేలా ఒప్పిస్తే మరింత భారీ మెజారిటీ వచ్చే అవకాశం ఉందన్న చర్చ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో పాటు జిల్లా వ్యాప్తంగా జోరందుకుంది. సోనియా గాంధీ నల్లగొండ పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేస్తే నల్లగొండ పేరు మళ్లీ చరిత్రలోకి ఎక్కే అవకాశం ఉంది. అందుకు ఆమెను ఒప్పించడం ద్వారా ఆమె నల్లగొండ నుంచి గెలుపొందడం, అదే సమయంలో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉమ్మడి జిల్లా ఊహించని విధంగా అభివృద్ధికి నోచుకుంటుందనే చర్చ పార్టీ శ్రేణుల్లో సాగుతోంది. ఇందులో భాగంగానే నల్లగొండ నుంచే సోనియా గాంధీని పోటీ చేయించాలనే ఉద్దేశంతో జిల్లాలోని ప్రస్తుత మంత్రులు, మాజీ మంత్రులు, కాంగ్రెస్ పెద్దలు ఉన్నట్లుగా తెలుస్తోంది.

ఆశలు పెట్టుకున్న వారికి ఇతర పదవులు..

ప్రస్తుతం నల్లగొండ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయాలని మాజీ మంత్రి జానారెడ్డితో పాటు ఆయన కుమారుడు రఘువీర్‌రెడ్డి భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట స్థానం నుంచి టికెట్ కోసం పటేల్ రమేష్‌రెడ్డి పోటీ పడటం, టికెట్‌ను మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి దక్కడంతో రమేష్‌రెడ్డికి ఎంపీగా అవకాశం కల్పిస్తామని టీపీసీసీతోపాటు ఏఐసీసీ నేతలు హామీ ఇచ్చారు. ఈ క్రమంలో మరికొందరు బీసీ, ఇతర నేతలు కూడా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినందున పార్లమెంట్ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో ఒకవేళ సోనియా గాంధీ నల్లగొండ నుంచి పోటీ చేస్తే మాత్రం ఆ నేతలకు నిరాశ తప్పదు. అయితే వారి హోదాను బట్టి ప్రభుత్వంలో ఇతర పదవులతో పాటు పార్టీ పదవులు ఇచ్చే అవకాశం ఉంది.

పునరావాస పనులు పూర్తి చేయాలి





సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్, హాజరైన వివిధ శాఖల అధికారులు

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ : జిల్లాలోని ప్రాజెక్టుల భూసేకరణ, పునరావాస కేంద్రాల పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ, భూసేకరణ, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కిష్టరాయపల్లి, శివన్నగూడెం, గొట్టిముక్కల, పెండ్లిపాకల, ఉదయ సముద్రం తదితర ప్రాజెక్టుల భూసేకరణ పనుల ప్రగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేసి పునరావాసం, రీ సెటిల్మెంట్ వెంటనే చేయాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టులు, లిఫ్ట్ ఇరిగేషన్ పనులపై చర్చించారు. సమావేశంలో ఆర్డీఓలు రవి, దామోదర్, లీల, స్పెషల్ కలెక్టర్ శ్రీదేవి, హేమలత, రాజశేఖర్ పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి

మిర్యాలగూడ టౌన్ : విద్యార్థులకు ఉపాధి అవకాశాలను కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన వృత్తి విద్యా కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని డీఐఈఓ దస్రూనాయక్ కోరారు. మంగళవారం మిర్యాలగూడలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఆన్ జాబ్ ఒకేషనల్ కోర్స్ శిక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ స్థాయిలో రెగ్యులర్ విద్యతో పాటు వృత్తి విద్యా కోర్సులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు సంవత్సరం పాటు అప్రెంటిషిప్ కోర్సులు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కోర్సులో ప్రతి విద్యార్థికి రూ.3 వేలు పారితోషికంగా అందించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ ధన్‌రాజ్, లెక్చరర్లు నాగరాజు, వరలక్ష్మి, వెంకటరమణ ఉన్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న డీఐఈఓ

ఆలయం వద్ద బహిరంగ వేలం పాటలు



వేలం పాటలో మాట్లాడుతున్న చైర్మన్ అలుగుబెల్లి నర్సింహారెడ్డి

కనగల్ : భక్తులకు కొంగు బంగారంగా విరాజిల్లుతున్న దర్వేశిపురం శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవస్థానం వద్ద వివిధ వస్తువుల విక్రయ హక్కులు కల్పించేందుకు మంగళవారం బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. సంవత్సరం కాలానికి కొబ్బరికాయలు అమ్మే హక్కులకు గాను రూ.82,50,000లకు తిరుమలగిరి గ్రామనికి చెందిన వంగూరి సోమయ్య, పూలు పండ్లు అమ్ముకొను హక్కులకు గాను రూ.10,50,000లకు పాలకుర్తికి చెందిన విజయ్‌కుమార్ దక్కించుకున్నారు. కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి జిల్లేపల్లి జయరామయ్య, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటలక్ష్మి, చైర్మన్ అలుగుబెల్లి నరసింహారెడ్డి, సర్పంచ్ అంజమ్మరామచంద్రం, మాజీ చైర్మన్లు దేప కరుణాకర్ రెడ్డి, ముత్తయ్య, యాదగిరి దేవాలయ సీనియర్ అసిస్టెంట్ జె.చంద్రయ్య, సిహెచ్.లింగయ్య, జూనియర్ అసిస్టెంట్ ఉపేందర్‌రెడి, ఎం.ఆంజనేయులు, జి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సృజన టెక్ ఫెస్ట్



నల్లగొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

రామగిరి(నల్లగొండ) : నల్లగొండలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సృజన టెక్ ఫెస్ట్ – 2023 గురువారం జరగనుంది. పాలిటెక్నిక్ కోర్సు విద్యార్థుల్లోని సృజనాత్మతకను, పరిశోధన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు సృజన టెక్ ఫెస్ట్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కాలేజ్ స్థాయిలో విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. కాలేజ్ స్థాయిలో ఎంపిక చేసిన ప్రాజెక్టును జిల్లా స్థాయి టెక్ ఫెస్ట్‌లో ప్రదర్శిస్తారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ పి.జానకిదేవి పర్యవేక్షణాధికారిగా, డాక్టర్ కె.అశోక్, టి.సుధాకర్ కోఆర్డినేటర్లుగా వ్యవహరించనున్నారు.

ప్రాజెక్టుల వివరాలు ఇలా..

జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ ఇంజనీర్, కంప్యూటర్ ఇంజనీర్ కోర్సుల విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శిస్తారు. సివిల్ ఇంజనీరింగ్‌కు సంబంధించి సూర్యాపేట పాలిటెక్నిక్ కళాశాల నుంచి గ్రీన్ బిల్డింగ్స్, నాగార్జునసాగర్ నుంచి తక్కువ ధరకు హౌసింగ్ బిల్డింగ్ మెటీరియల్స్, తిరుమలగిరి కళాశాల నుంచి మురుగునీటి శుద్ధి కర్మాగారం, నల్లగొండ కళాశాల నుంచి స్మార్ట్ పాలిటెక్నిక్ క్యాంపస్ ప్రాజెక్టులు ప్రదర్శించనున్నారు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో నల్లగొండ కళాశాల విద్యార్థుల రూపొందించిన కాలేజ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, సూర్యాపేట కాలేజీ నుంచి కెరీర్ గైడెన్స్ మెరుగుపరచడం అనే ప్రాజెక్టులను ప్రదర్శిస్తారు.



బాలాజీ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల స్టాల్స్, మగ్గాలు

నేడు రాష్ట్రపతి రాకకు పోచంపల్లి ముస్తాబు

- టై అండ్ డై, ఇక్కత్ చీరల తయారీని పరిశీలించనున్న ద్రౌపదీ ముర్ము
- చేనేత ప్రముఖులతో ముఖాముఖి
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- 700 మంది పోలీసులతో భారీ బందోబస్తు
- చేనేత వైభవం ప్రతిబింబించేలా స్వాగత తోరణాలు



ప్రవేశద్వారం వద్ద బాంబ్ స్క్వాడ్ బందోబస్తు



భూదాన్‌పోచంపల్లి: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం భూదాన్‌పోచంపల్లికి రానున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్రపతి ఉదయం 11 గంటలకు ఆర్మీ ప్రత్యేక చాపర్‌లో హైదరాబాద్ నుంచి పోచంపల్లికి చేరుకోనున్నారు. మొత్తం మూడు ఆర్మీ విమానాల కోసం స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో హెలిపాడ్‌లను ఏర్పాటు చేశారు. రాష్ట్రపతి మొదటగా సందర్శించనున్న శ్రీ రంజన్ వీవ్స్ యూనిట్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మెయిన్‌రోడ్డు నుంచి వీవ్స్ యూనిట్ వరకు బీటీ రోడ్డు వేసి ఇరువైపులా షామియానాలు వేశారు. అదేవిధంగా బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న సభ కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సభా ప్రాంగణానికి చేరుకోవడానికి రాష్ట్రపతి కోసం ప్రత్యేక ద్వారం, ఇతర వీఐపీలు, కార్మికులు వచ్చేందుకు వేర్వేరు ద్వారాలు ఏర్పాటు చేశారు. కాగా.. చేనేత వైభవం ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు, చేనేత చీరల డిజైన్ల ఫ్లెక్సీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఆకట్టుకుంటున్న థీమ్ పెవిలియన్..

బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ చేనేతల ఔన్నత్యాన్ని చాటిచెప్పేలా థీమ్ పెవిలియన్ ఏర్పాటు చేశారు. ఇందులో ముఖ్యంగా పోచంపల్లి ఇక్కత్ చీరలు, సిద్దిపేట గొల్లభామ చీరలు, వరంగల్ శారీస్, నారాయణపేట చీరల స్టాల్స్‌తో పాటు తేలియా రుమాళ్లు, పోచంపల్లి సింగిల్, డబుల్ ఇక్కత్ వస్త్రాలు, టస్సార్ సిల్క్, హిమ్రు శారీస్, ఆర్మూర్ చీరలు, వెజిటెబుల్ కలర్స్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్, వడికిన నూలు, ముడి నూలును ప్రదర్శనగా ఉంచారు. వీటితో పాటు 5 ఫ్రేమ్ మగ్గాలు, ఆధునిక ఆసుయంత్రం, సంప్రదాయ ఆసు, 25 చరఖాలను ఏర్పాటు చేశారు.

భారీ బందోబస్తు

రాష్ట్రపతి పర్యటనకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సభాప్రాంగణం, హెలిపాడ్, శ్రీ రంజన్ వీవ్స్, వినోబాభావే మందిరం, టూరిజం పార్కు వద్ద సుమారు 700 మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

కోవిడ్ టెస్టులు చేయించుకుంటేనే ఎంట్రీ

కొద్దిరోజులుగా కోవిడ్ వేరియంట్ జేఎన్.1 కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రపతి సభకు హాజరయ్యే చేనేత కార్మికులు, వీఐపీలకు కోవిడ్ టెస్టులు తప్పనిసరి చేశారు. ఈ టెస్టులు చేయించుకున్న సర్టిఫికెట్ ఉంటేనే లోనికి ఎంట్రీ అవకాశం కల్పించారు. దీంతో రాష్ట్రపతి సభకు హాజరుకావడానికి పేరు నమోదు చేసుకున్న స్థానిక 300 మంది చేనేత కార్మికులు మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్ద కరోనా పరీక్షలు చేయించుకున్నారు.

రాష్ట్రపతి పర్యటన షెడ్యూల్..

- ఉదయం 11 గంటలకు ప్రత్యేక చాపర్‌లో పోచంపల్లికి చేరుకుంటారు.
- 11 గంటల నుంచి 11.20 గంటల వరకు శ్రీరంజన్ వీవ్స్ యూనిట్‌ను సందర్శించి అక్కడ మల్టీ వీవింగ్ యూనిట్, ట్విస్టింగ్ యూనిట్‌ను పరిశీలిస్తారు
- 11.25 గంటల నుంచి 11.40 గంటల వరకు వరకు బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో థీమ్ పెవిలియన్‌ను సందర్శిస్తారు.
- 11.40 గంటల నుంచి 11.45 గంటల వరకు చరఖా వీవింగ్ రూమ్‌ను సందర్శిస్తారు. వినోబాభావే చిత్రపటానికి నివాళులర్పిస్తారు. అనంతరం ఫొటో గ్యాలరీని తిలకిస్తారు.
- 11.45 నుంచి 11.55 గంటల వరకు సభావేదిక వద్దకు చేరుకుంటారు.
- 11.55 నుంచి 12.05 గంటల వరకు కేంద్ర ప్రభుత్వ జౌళి శాఖ సెక్రటరీ రచన షా స్వాగత ఉపన్యాసం చేస్తారు. అనంతరం ముగ్గురు చేనేత కార్మికుల చేత రాష్ట్రపతికి సన్మానం, రాష్ట్రపతితో చేనేత కార్మికులు తమ అనుభవాలను పంచుకుంటారు.
- మధ్యాహ్నం 12.05 నుంచి 12.15 గంటల వరకు చేనేత కార్మికులతో ముఖాముఖి.
- 12.15 నుంచి 12.20 గంటల వరకు జాతీయ గీతాలాపన.
- 12.20 నుంచి 12.30 గంటలకు పోచంపల్లి నుంచి హెలిపాడ్ వద్ద చేరుకుంటారు.
- 12.40 గంటలకు పోచంపల్లి నుంచి తిరుగు ప్రయాణం.

జేఎన్1 అలర్ట్

దేశంలో కరోనా కొత్తవేరియంట్ కలవరం

- పలు రాష్ట్రాల్లో కేసుల నమోదుతో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తం
- బెడ్‌లు, ఆక్సిజన్, మందుల వివరాలు ప్రభుత్వానికి అందజేసిన జిల్లా అధికారులు
- జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుల సూచన



నల్లగొండ టౌన్ : ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా మహమ్మారి కనుమరుగైందన్న ఆనందంలో ఉన్న ప్రజలను కొత్త వేరియంట్ (జేఎన్1) కలవరపెట్టిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో కూడా మంగళవారం ఐదు కేసులు నమోదైనట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో ప్రజల్లో ఒకింత ఆందోళన మొదలైంది. తమిళనాడు, కేరళ రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా కేసులు నమోదవుతున్నందున కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం.. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలో ఆక్సిజన్ నిల్వలు, ఆక్సిజన్ బెడ్‌లు, మందులు, మాస్కులు, ఆర్‌టీపీసీఆర్ పరీక్షల కిట్‌లు, ఇతర ఎక్విప్‌మెంట్, వైద్యులు, సిబ్బంది వివరాలను అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖను ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలో అందుబాటులో ఉన్న వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్‌కు నివేదించింది. ఒకవేళ కరోనా కొత్త వేరియంట్ వ్యాప్తి చెందితే తీసుకోవాల్సిన చర్యలు, వైద్య సేవలకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. దీనికి అనుగుణంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సర్వం సిద్ధమైంది.

2020 మార్చిలో మొదలైన కరోనా..

2020 ఏప్రిల్‌లో జిల్లాలో తొలి కరోనా కేసు జిల్లాలో నమోదైంది. అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం కరోనా కట్టడి కోసం లాక్‌డౌన్ విధించడంతో పాటు విద్యా, వ్యాపార రంగాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, షాపింగ్ మాల్స్, ఇతర అన్ని రకాల వాణిజ్య సంస్థలను మూసివేసిన విషయం తెలిసిందే. అదే విధంగా కరోనా ప్రబలిన ప్రాంతాలను పూర్తిగా మూసివేసి ఎవ్వరినీ బయటికి రానివ్వకుండా ఇంటికే మందులను అందించారు. దీంతో కరోనా కట్టడి అయిన విషయం తెలిసిందే. తిరిగి 2021 మార్చి నెలలో కరోనా సెకండ్ వేవ్ విజృంభించింది. ఏప్రిల్, మే, జూన్ మూడు నెలల పాటు వేలాది మంది కరోనా బారిన పడడంతో ఆస్పత్రుల్లో బెడ్‌లు కూడా దొరకలేదు. జిల్లాలో 1,107 మందిని కరోనా పొట్టనబెట్టుకుని వారి కుటుంబాల్ని చిన్నాభిన్నం చేసింది. 2022 మార్చి వరకు పూర్తిగా కంట్రోల్‌లోకి వచ్చింది. ఆ తరువాత కేవలం వేళ్లమీద లెక్కపెట్టే సంఖ్యలో మాత్రమే పాజిటివ్ కేసులు నమోదైనప్పటికీ ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ప్రస్తుతం వస్తున్న కొత్త వేరియంట్‌లో మరణాలు కూడా జరుగుతుండడంతో ప్రజల్లో భయాందోళన మొదలైంది. దానికి దృష్టిలో పెట్టుకుని వైద్య ఆరోగ్యశాఖ ముందస్తుగా చర్యలు తీసుకుంటుంది. నల్లగొండలోన జీజీహెచ్‌తో పాటు అన్ని ఏరియా ఆస్పత్రులలో ఆర్‌టీపీఆర్ పరీక్షలను చేయడానికి సన్నద్ధమవుతోంది.

జాగ్రత్తలు పాటించాలి



ఇతర రాష్ట్రాలో కరోనా కొత్త వేరియంట్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తం చేసింది. జిల్లాలో కేసులు లేనప్పటికీ ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలి. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు మాస్కులు ధరించాలి. ప్రభుత్వ సూచన మేరకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నాం. ప్రజలు పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావు, డీఎంహెచ్‌ఓ

క్లుప్తంగా

ఎమ్మెల్యే ఐలయ్య విజయోత్సవ సభలో దొంగల చేతివాటం

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో సోమవారం రాత్రి ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య విజయోత్సవ సభలో దొంగలు చేతి వాటం ప్రదర్శించారు. పల్లెపహాడ్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు, పీఏసీఎస్ డైరెక్టర్ ఎగ్గిరి యాదగిరి వద్ద రూ.23వేలు, మోదుబావిగూడేనికి చెందిన కోల రాములు వద్ద రూ.56వేలు, పోతిరెడ్డిపల్లికి చెందిన నాగుల ఆనంద్‌యాదవ్ వద్ద రూ.5వేలను జేబు దొంగలు అపహరించుకుపోయారు.

విద్యుత్ తీగలు తగిలి గడ్డి లోడు దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది, స్థానికులు

కోదాడరూరల్: మండల పరిధిలోని మంగళితండాలో గడ్డి లోడుకు విద్యుత్ తీగలు దగ్ధమైంది. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా వత్సవాయి మండలం గోపినేనిపాలెం గ్రామానికి చెందిన తేజావత్ నాగు కోదాడ మండలంలోని మంగళితండాకు చెందిన ఓ రైతు వద్ద 100 మోపుల గడ్డిని కొనుగోలు చేసి ట్రాక్టర్‌పై తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో తండాలోని ఆలయ సమీపంలో విద్యుత్ తీగలు కిందకు ఉండటంతో గడ్డి లోడుకు తగిలి మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి ఫైర్ స్టేషన్ సమాచారం అందించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఫైరింజన్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చి ట్రాక్టర్ కాలిబూడిద కాకుండా కాపాడారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



ప్రసాద్ (ఫైల్)

డిండి: భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం డిండి మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డిండి మండల కేంద్రానికి చెందిన చింతపల్లి ప్రసాద్(23)కు ఏడాది క్రితం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన అమ్మాయితో వివాహం జరిగింది. ఇటీవలి కాలంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ప్రసాద్ భార్య గత కొన్నినెలలుగా తన తల్లిగారి ఇంటి వద్దనే ఉంటోంది. పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి రావడం లేదని, ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన ప్రసాద్ మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఈదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

దేవాదాయ శాఖ మంత్రిని కలిసిన యాదాద్రి ఆలయ ఈఓ



మంత్రి కొండా సురేఖకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈఓ గీతారెడ్డి

యాదగిరిగుట్ట: రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈఓ గీతారెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా యాదాద్రీశుడి చిత్రపటం, లడ్డూ ప్రసాదంను మంత్రికి అందజేశారు. యాదాద్రి ఆలయాన్ని సందర్శించాలని మంత్రి కొండా సురేఖను ఈఓ కోరారు.

నేడు రాష్ట్రపతి రాక.. నేతన్నల సంతోషం

- దేశ ప్రథమ మహిళకు పోచంపల్లి ఇక్కత్ చీరలను బహూకరించనున్న చేనేత కార్మికులు

భూదాన్‌పోచంపల్లి: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం పోచంపల్లికి వస్తుండటంతో స్థానిక చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రపతి నేత కార్మికులతో మాట్లాడటం, పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల ప్రాముఖ్యత, నేతన్నల జీవనస్థితిగతులను స్వయంగా తెలుసుకోనుండటం ఆనందంగా ఉందని కార్మికులు పేర్కొంటున్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత గజం అంజయ్య రాష్ట్రపతికి బహూకరించడానికి సహజ రంగులతో చెక్స్ డిజైన్‌లో డబుల్ ఇక్కత్ చీరలను తయారు చేయించాడు. పోచంపల్లికి చెందిన శ్రీరంజన్ వీవ్స్ యజమాని ఎన్నం శివకుమార్ రాష్ట్రపతిని సన్మానించడానికి ప్రత్యేకంగా మర్సాస్ సంబల్‌పురి పోచంపల్లి ఇక్కత్ డిజైన్ చీర, టస్సార్ స్పన్ చీరలను తయారు చేయించాడు. పోచంపల్లి టై అండ్‌డై అసోషియేషన్ అధ్యక్షుడు తడక రమేశ్ సైతం ఇక్కత్ చీరలను బహూకరించనున్నారు.



రాష్ట్రపతికి పోచంపల్లి చేనేత కార్మికులు బహూకరించనున్న చీరలు ఇవే..

చేనేతకు మంచి భవిష్యత్తు ఉంటుంది



పోచంపల్లికి రాష్ట్రపతి వస్తుండటంతో చేనేతకు మంచి భవిష్యత్తు ఉంటుందని భావిస్తున్నాం. చేనేత కార్పొరేషన్ ఏర్పాటు చేసి చేనేత వస్త్రాలను మార్కెటింగ్ చేసేలా చూడాలని రాష్ట్రపతిని కోరుతాం. వివిధ విదేశాల్లో షోరూమ్‌లు ఏర్పాటు చేసి చేనత వస్త్రాలను విక్రయించడం ద్వారా నేతన్నలకు ఏడాదంతా చేతినిండా పని దొరుకుతుంది. నేను ప్రత్యేకంగా తయారు చేయించిన చీరను రాష్ట్రపతికి బహూకరిస్తా.

– గజం అంజయ్య, పద్మశ్రీ అవార్డు గ్రహీత

మా సమస్యలు చెప్పుకుంటాం



రాష్ట్రపతి స్వయంగా చేనేత కార్మికుల స్థితిగతులను తెలుసుకోనుండడంతో మాకు కొత్త స్కీమ్‌లు వచ్చే అవకాశం ఉంది. ఫలితంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని అనుకొంటున్నాం. అధికారులు అవకాశం కల్పిస్తే రాష్ట్రపతికి మా సమస్యలు చెప్పుకొంటాం.

– తడక వెంకటేశం, చేనేత కార్మికుడు, భూదాన్‌పోచంపల్లి

అదృష్టంగా భావిస్తున్నాం



భారత రాష్ట్రపతి స్వయంగా మా ఇంటికి వస్తుండటం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాం. అధికారులు బుధవారం ఉదయమంతా మమ్మల్ని అందుబాటులో ఉండమని చెప్పారు. రాష్ట్రపతి వచ్చి చీర నేస్తే మీకు ఎంత గిట్టుబాటు అవుతుంది. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అడిగితే సమాధానం చెప్పమన్నారు. ప్రింటెడ్ చీరలను అరికట్టి చేనేతను ప్రోత్సహించాలి.

– పొట్టబత్తిని శేఖర్, చేనేత కార్మికుడు, భూదాన్‌పోచంపల్లి

సిల్క్ యూనిట్‌ను సందర్శించడం సంతోషకరం



కేంద్ర ప్రభుత్వ సహకారంతో శ్రీరంజన్‌వీవ్స్ యూనిట్‌ను నెలకొల్పాను. అయితే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము యూనిట్ సందర్శిస్తుండటం ఎంతో సంతోషంగా ఉంది. ఈ సందర్భంగా రాష్ట్రపతికి బహూకరించడానికి ప్రత్యేకంగా మర్సాస్ సంబల్‌పురి పోచంపల్లి ఇక్కత్‌చీరతో పాటు టస్సార్ స్పన్ ఇక్కత్ చీరను తయారు చేయించాను.

– ఎన్నం శివకుమార్, శ్రీరంజన్ వీవ్స్ యజమాని, భూదాన్‌పోచంపల్లి

ఇసుక మాఫియాపై ఉక్కుపాదం

- రైతుల సమక్షంలో బిక్కేరు వాగులో రోడ్లను ధ్వంసం చేయించిన ఎమ్మెల్యే మందుల సామేల్
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు, ప్రజలు



బిక్కేరు వాగులో రోడ్డును తొలగింపజేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్ తదితరులు

మోత్కూరు, అడ్డగూడూరు: తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ తన సొంత గ్రామమైన అడ్డగూడూరు మండలం ధర్మారం సమీపంలోని బిక్కేరు వాగులో ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తన నియోజకవర్గం ఇసుక మాఫియాను తరిమికొడతానని ప్రజలు, రైతులకు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం మంగళవారం ఆయన ధర్మారం సమీపంలోని బిక్కేరులోకి వందలాది మంది రైతులు, గ్రామస్తుల సమక్షంలో వెళ్లి బిక్కేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేసేందుకు వేసిన ఎర్ర మట్టి రోడ్లను జేసీబీల సహాయంతో తొలగించారు. వాగులోని భారీ యంత్రాలను, జేసీబీలను బయటికి తరలించారు. తొలగించిన ఎర్ర మట్టిని రైతులు వ్యవసాయ బావుల వద్ద బాటలకు తరలించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామేల్ మాట్లాడుతూ.. మూసీ నది, బిక్కేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తే ఊరుకునేది లేదని అన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తుండడంతో భూగర్భ జలాలు అడుగంటి రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఇసుక తరలింపునకు న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో రైతులు, ప్రజలు పెద్దఎత్తున ఎమ్మెల్యే సామేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోలెబోయిన లింగయ్యయాదవ్, కోటమర్తి ఎంపీటీసీ పాశం యాదమ్మసత్యనారాయణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాచకొండ రమేష్, సర్పంచులు పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి ఆకు పూజ

యాదగిరిగుట్ట: యాదాద్రి ఆలయానికి క్షేత్రపాలకుడిగా పూజలందుకుంటున్న ఆంజనేయస్వామికి ఆచార్యులు మంగళవారం ఆకుపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. ఇక ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగించారు.

కొనసాగుతున్న ధనుర్మాసోత్సవాలు..

యాదాద్రి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు అంగరంగ కొనసాగుతున్నాయి. మంగళవారం వేకువజామున 4.30గంటలకు గోదాదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయంలో విశేషంగా పూజలు చేశారు. గోదాదేవికి ఇష్టమైన 3వ పాశురాన్ని అర్చకులు పఠించారు. అనంతరం కట్టెపొంగలిని ఆరగింపుగా పెట్టారు.

మట్టపల్లిలో నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో లక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్య అగ్నిహోత్రి, మూల విరాట్ స్వామికి పంచామృతాభిషేకం చేశారు. అదేవిధంగా లక్ష్మీనృసింహస్వామి, రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. కల్యాణతంతులో భాగంగా ఆలయ ముఖ మండపంలో స్వామి, అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగళ్యధారణ చేశారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలోని క్షేత్రపాలకుడు శ్రీవీరాంజనేయస్వామికి తమలపాకుల పూజ, అర్చనలు గావించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పశువుల కొట్టం దగ్ధం



మంటల్లో కాలుతున్న పశువుల కొట్టం

రామన్నపేట: నిప్పంటుకొని పశువుల కొట్టం దగ్ధమైంది. ఈ ఘటన మంగళవారం రామన్నపేట మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మాపురం గ్రామానికి చెందిన నీల మునగయ్య రోజు మాదిరిగానే మంగళవారం కూడా తన జీవాలను మేపడానికి తోలుకెళ్లాడు. మధ్యాహ్న సమయంలో పశువులను ఉంచే కొట్టంకు నిప్పంటుకొని దగ్ధమైంది. ప్రమాద సమయంలో కొట్టంలో ఉన్న పది గొర్రె పిల్లలను స్థానికులు బయటకు తీసి కాపాడారు. గుర్తుతెలియని వ్యక్తులు ఎవరో కావాలనే కొట్టానికి నిప్పంటించారని, నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి



సక్కుబాయి (ఫైల్)

నాంపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. వివరాలు.. నాంపల్లి మండల కేంద్రానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన 11మంది సోమవారం మధ్యాహ్నం కారులో హాలియా వెళ్లారు. అక్కడ బంధువుల వివాహ రిసెప్షన్‌లో పాల్గొని రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో మహ్మదాపురం గ్రామ శివారు మూలమలుపులో కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఏడుగురికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని అంబులెన్స్‌లో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతున్న బిరుదోజు సక్కుబాయి (75)మంగళవారం ఉదయం మృతిచెందింది.

సకాలంలో జీతాలు ఇవ్వాలని వినతి



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న ధరణి కంప్యూటర్ ఆపరేటర్లు

కోదాడరూరల్: రాష్ట్రంలోని తహసీల్దార్ కార్యాలయాల్లో పనిచేస్తున్న ధరణి కంప్యూటర్ ఆపరేటర్లకు ప్రతి నెలా సకాలంలో జీతాలు చెల్లించాలని ఆ సంఘం ఉద్యోగులు మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు మంత్రులను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. తమకు తొమ్మిది నెలలుగా జీతాలు సక్రమంగా అందక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అదేవిధంగా తమకు జీఓ నంబర్ 63 ప్రకారం రూ.31,040 కనీస వేతనం రావాల్సి ఉండగా కేవలం రూ.11,070 మాత్రమే చెల్లిస్తున్నారని అన్నారు. తమకు వేతనాలు పెంచి ప్రతి నెల సక్రమంగా అందేలా చూడాలని, మహిళా ఆపరేటర్లకు ప్రసూతి సమయంలో వేతనంతో కూడి సెలవులను మంజూరు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో పురుషోత్తం, లింగరాజు, సంపత్, బ్రహ్మం, అవినాష్, విజయ్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాజాపేట: తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీల్లో రాజపేట మండలంలోని బొందుగుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు అశ్రఫ్ జనిషేక్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం బొందుగుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. తమ పాఠశాల నుంచి అండర్–17 విభాగంలో జశ్వంత్, భానుచందర్, భరత్‌రెడ్డి, మనోజ్‌కుమార్, కావ్య, అనుష, అండర్–14 విభాగంలో ఉమ, శివ, కార్తీక్, భాను, చరణ్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు అశ్రఫ్ జనిషేక్ తెలిపారు. వీరు ఈ నెల 21 నుంచి 23 వరకు నిర్మల్ పట్టణంలో జరగనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా తరఫున పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను పీఈటీ మధు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

కరెంటు కాటుకు ఇద్దరు రైతులు బలి



లక్ష్మీనర్సయ్య (ఫైల్)



వీరబాబు (ఫైల్)

గరిడేపల్లి: విద్యుదాఘాతానికి గురై వేర్వేరు చోట్ల ఇద్దరు రైతులు మృతిచెందారు. వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ వైరును కలుపుతుండగా విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. ఈ ఘటన గరిడేపల్లి మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రాపురం గ్రామానికి చెందిన బొలిశెట్టి లక్ష్మీనర్సయ్య(52) మంగళవారం మధ్యాహ్నం తన వ్యవసాయ పొలంలో గడ్డి మందును పిచికారీ చేసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో పొలం గట్టుపై విద్యుత్ వైరును సరిచేసే క్రమంలో వైరు కట్ అయి ఉండడాన్ని గమనించక అతడు తన చేతులోకి వైరును తీసుకోగా విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. పొలం గట్టుపై విగతజీవిగా పడి ఉన్న లక్ష్మీనర్సయ్యను పానుగోడు గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. కుటుంబ సభ్యులు వెళ్లి చూసేసరికి అప్పటికే లక్ష్మీనర్సయ్య మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్యకి మూడు నెలల క్రితం పక్షవాతం రావడంతో ఆమెకు ఆయనే సపర్యలు చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

హుజూర్‌నగర్‌లో మరో రైతు..

హుజూర్‌నగర్: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన హుజూర్‌నగర్‌లో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన గోసుల వీరబాబు(33) కొత్వాల్‌గడ్డ సమీపంలో వి. లక్ష్మీనారాయణ పొలాన్ని కౌలుకు తీసుకుని సేద్యం చేస్తున్నాడు. ఆ పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజ్ పోవడంతో ఎలక్ట్రీషియన్‌తో ఫ్యూజ్ వేయించి తిరిగి ట్రాన్స్‌ఫార్మర్ ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే అతడు మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి గోసుల లింగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మంత్రి ఉత్తమ్‌ను కలిసిన కాసోజు శంకరమ్మ



మంత్రి ఉత్తమ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాసోజు శంకరమ్మ

హుజూర్‌నగర్: రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని హైదరాబాద్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి, తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి మాతృమూర్తి కాసోజు శంకరమ్మ కలిశారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌ను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆమె వెంట మోత్కూరు మాజీ ఎంపీపీ వంగాల సత్యనారాయణ, పర్వతం అశోకాచారి తదితరులు ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రామగిరి(నల్లగొండ): తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మంగళవారం తిప్పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. తిప్పర్తి ఎస్‌ఐ ఎన్. ధర్మ తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండల కేంద్రంలోని నకిరేకల్ రోడ్డులో నివాసముంటున్న గుండా ఓంప్రకాష్ ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఈ నెల 15వ తేదీన సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లారు. కాగా మంగళవారం ఉదయం ఆ ఇంట్లో పనిచేసే పనిమనిషి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో విషయాన్ని యజమానికి తెలియజేసింది. దీంతో వారు వెంటనే హైదరాబాద్ నుంచి ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో దాచిపెట్టిన ఏడు తులాల బంగారు ఆభరణాలు, 600 గ్రాముల వెండి ఆభరణాలు కనిపించలేదు. ఓం ప్రకాష్ కుమారుడు గుండా అభిలాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జాతీయస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక



ప్రణతిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చౌటుప్పల్: మండలంలోని జైకేసారం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని కొంక ప్రణతి ఈ నెల 11, 12 తేదీల్లో మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–14 రగ్బీ పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యింది. ఈ సందర్భంగ మంగళవారం పాఠశాలలో ప్రణతిని గ్రామ సర్పంచ్ కె. సైదులు, హెచ్‌ఎం మోహన్‌రెడ్డి, పీఈటీ అంబటి రేణుక, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. ఈ నెల 22 నుంచి 26 వరకు ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరిగే జాతీయ స్థాయి 67వ స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరపున ప్రణతి పాల్గొంటుందని పాఠశాల హెచ్‌ఎం తెలిపారు.

హాకీ పోటీలకు..



లాదినేని శృతి

అడ్డగూడూరు: మండలంలోని ధర్మారం గ్రామనికి చెందిన లాదినేని పూర్ణచందర్ కుమార్తె శృతి ఇటీవల హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హాకీ పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. బుధవారం కర్ణాటక రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో అండర్–17 విభాగంలో శృతి పాల్గొననున్నట్లు మంగళవారం ఆమె తల్లిదండ్రులు తెలిపారు. శృతి ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఈసీఐఎల్‌లో గల తెలంగాణ మైనార్టీ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతోంది.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

■ వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు. NPA కూడా ధరఖాస్తు. డాల్ఫిన్ ఫైనాన్స్, రాజన్, సెల్: 8437924006. [W-788966]

Wanted

■ నూతనంగా ప్రారంభించిన మా సంస్థలో 10th, ఇంటర్ చదివిన స్త్రీ/పు లు కావలెను. జీతం: 14,000+DA5500+ఫ్రీరూం. సంప్ర: నల్గొండ. సెల్: 8519891505. [L-822256]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9640258899/ 9640468899 [H-793665]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1167554]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరదమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పచ్చిరొట్ట ఎరువులతో సాగు సుభిక్షం

- పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్



పాడి పంట

పెద్దవూర: ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించినప్పటికీ పంటల సాగులో విచక్షణా రహితంగా వినియోగించే రసాయనాల ద్వారా అనేక అనర్థాలు సంభవిస్తున్నాయి. నేల భౌతిక లక్షణాలు దెబ్బతిని నీటిని నిల్వ చేసే సామర్థ్యాన్ని క్రమంగా కోల్పోతున్నాయి. సూక్ష్మ పోషక లోపాలు తరుచుగా కనపడుతున్నాయి. ఉత్పాదక తగ్గి, ఖర్చు పెరిగిపోతోంది. ప్రస్తుతం రైతులు బోర్లు, బావులు, చెరువుల కింద యాసంగికి వరినార్లు పోస్తున్నారు. ఈ నేపథ్యంలో నేల సహజత్వాన్ని కాపాడుతూ అధిక దిగుబడులు పైర్లు ఎంతగానో సహకరిస్తాయని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి కె.సందీప్ తెలిపారు.

పచ్చిరొట్ట ఎరువులు

తేలికగా చివికి పోయే స్వభావం కలిగి, నేలకు సత్తువను చేకూర్చే పంటలు , అటువంటి లక్షణాలు గల పంటల ఆకులను గానీ పచ్చిరొట్ట ఎరువులు అంటారు.

పచ్చిరొట్ట పంటల సాగు

- పచ్చిరొట్ట పైర్లను పొలంలో చల్లి అవి పెరిగాక అదే పొలంలో కలియదున్ని పంట వేసుకోవడం. ఉదా: జీలుగ, జనుము, పిల్లిపెసర, అలసంద, ఉలువ, పెసర
- పచ్చిరొట్ట ఆకులను బయట నుంచి సేకరించి పొలంలో కలియదున్ని కుళ్లనిచ్చి తర్వాత పంట వేసుకోవడం . ఉదా: గైలరిసీజియా, జిల్లేడి, గానుగ, నేల తంగేడు.
- పొలం గట్ల వెంట, బావుల దగ్గర గైలరిసీడియా చెట్ల నాటితే ఒక్కో చెట్టు ఏటా రెండుసార్లు (జూలై, డిసెంబర్ నెలల్లో) 100–125 కిలోల పచ్చిరొట్టను ఇస్తుంది.
- ఎకరానికి జీలుగ 12 కిలోలు, జనుము 16 కిలోలు, పిల్లిపెసర 8 కిలోలు, అలసంద ఎకరానికి 10 కిలోల విత్తనాలు వేసుకోవాలి.



పెద్దవూరలో సాగవుతున్న పచ్చిరొట్ట పైరు

పచ్చిరొట్ట పంటలు–లక్షణాలు

- త్వరగా ఎదిగి ఎక్కువ ఆకులు, పచ్చికాండం ఇవ్వగలిగే సామర్థ్యం, మొక్క భాగాలు మృదువుగా, పెళుసుగా, రసపూరితంగా ఉండి త్వరగా కుళ్లిపోయే స్వభావం కలిగి ఉండాలి. అన్ని రకాల నేలలు, వాతావరణ పరిస్థితులు, నీటి ఎద్దడిని తట్టుకునే సామర్థ్యం కలిగి, పప్పు జాతికి చెందిన మొక్కలై ఉండాలి.

పచ్చిరొట్ట పైర్లు–ప్రయోజనాలు

- పచ్చిరొట్ట పైర్లు నేలలో కుళ్లేటప్పుడు జరిగే రసాయన ప్రక్రియల వలన భూమిలోని పోషక పదార్థాలు మొక్కలకు సులభంగా లభ్యమవుతాయి.
- వీని సాగువలన నేల భౌతిక లక్షణాలు వృద్ధి చెందటమే కాకుండా నత్రజని ఎరువుల వాడకాన్ని 25–30 శాతం తగ్గించవచ్చు.
- నేల నీటి సామర్థ్యం వృద్ధి చెందటంతో పాటు నేల కోతను అరికడుతుంది.
- పచ్చిరొట్ట ఎరువులు సేంద్రియ ఎరువులు. నీటి ద్వారా నేలలో మేలు చేసే సూక్ష్మజీవులు వృద్ధి చెంది మొక్కలకు రోగనిరోధక శక్తిని పెంచటంతో నేల ద్వారా సంక్రమించే తెగుళ్లను అరికడుతుంది.
- భూమి గుల్లబారి పంట మొక్కల వేర్లకు అవసరమయ్యే గాలి, నీరు పుష్కలంగా అందుతాయి.
- దీర్ఘకాలిక పంటల్లో, పండ్లతోటల్లో పచ్చిరొట్ట పంటను సాగు చేసి పూత దశలో కలిదున్నడం వలన నేల సారవంతం అవుతుంది.

పచ్చిరొట్ట పంటలు - విత్తే సమయం, జాగ్రత్తలు

పచ్చిరొట్ట పైర్లను తొలకరి వర్షాలు మొదలైనప్పుడు నాటుకోవచ్చు. పచ్చిరొట్ట దిగుబడి, నత్రజని స్థిరీకరణ, పైరు దశ మీద ఆధారపడి ఉంటుంది. సాధారణ దిగుబడి రావడానికి 45 రోజుల సమయం పడుతుంది. పూత దశలో రోటావేటర్ లేదా పవర్ టిల్లర్ సహాయంతో కలియదున్నడం వలన భూమికి అత్యధిక సత్తువను చేకూర్చుతుంది. నత్రజని వృథాగా పోకుండా ఉండటానికి కనీసం 15 నుంచి 22 సెం.మీ. లోతులో కలియదున్నాలి. మురుగునీరు పోయే సౌకర్యం లేని వరి పొలాల్లో పచ్చిరొట్ట కుళ్లుతున్నప్పుడు మధ్యలో తయారయ్యే కొన్ని వాయువులు అప్పుడే నాటిన వరి మొక్కలకు హాని కలిగిస్తాయి. కాబట్టి కలియదున్నిన రెండు వారాల తర్వాత మాత్రమే నాట్లు వేసుకోవాలి.

- చౌడు సమస్యను తొలగించటంతో పాటు భూసార పరిరక్షణకు తోడ్పడతాయి.
- ముఖ్యంగా వరిసాగు చేసే ప్రాంతాల్లో వరి పంట ముందు పచ్చిరొట్ట పైర్లను సాగు చేయడం వలన బియ్యంలో విటమిన్లు, మాంసకృత్తుల శాతం పెరిగినట్లు పరిశోధనా ఫలితాల్లో వెల్లడైంది. దిగుబడి కూడా 15–20 శాతం పెరుగుతుందని రుజువైంది.